సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 30 । నవంబర్ । 2024



ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకర జీవితం

ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకరంగా జీవించవచ్చని విజయవాడ ఇండ్లాస్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఇండ్ల రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. -8లో



రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి

రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ కోరారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 27.7/23.4

జిల్లాలో శుక్రవారం 23.4 – 27.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నలుగురు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

కడప సెవెన్‌రోడ్స్: పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్న నలుగురు డిప్యూటీ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో నియమించింది. ఎ.వెంకటేశ్‌ను కడప జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్‌కు పీఏగా నియమించారు. జి.చిన్నయ్యను ముద్దనూరు జీఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఎస్.నీలమయ్యను కడప ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారిగా నియమించారు. యు.రంగస్వామిని కడప జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు.

ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరి

కడప రూరల్: ప్రైవేట్ ఆసుపత్రులకు తప్పనిసరిగా ఫైర్ ఎన్‌ఓసీ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాల వలన రోగులకు ఎలాంటి అపాయం జరగకూడదని పేర్కొన్నారు. అలా జరగకుండా ఉండడానికి పడకలు కలిగిన ప్రతి ప్రైవేట్ ఆసుపత్రికి ఫైర్ ఎన్‌ఓసీ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఫైర్ ఎన్‌ఓసీ లేనివారు, రెన్యువల్ గడువు ముగిసిన వారు వెంటనే అగ్నిమాపక శాఖ నుంచి వెంటనే అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతులు తీసుకున్న పత్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఫైర్ ఎన్‌ఓసీ లేని ఆసుపత్రులపై కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పుష్పగిరి హుండీ ఆదాయం లెక్కింపు



వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ ఏడాది మే 20 వ తేదీ నుండి నవంబర్ 29 వ తేదీ వరకు స్వామిని దర్శించుకున్న భక్తులు హుండీల ద్వారా సమర్పించుకున్న కానుకలను కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఏసీ ఎమ్ మల్లికార్జున పర్యవేక్షణలో లెక్కించారు. ఇందులో మొత్తం రూ.4,30,494 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ. కే. శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, చెన్నూరుకు చెందిన బసిరెడ్డి, ఆలయ అర్చకులు, దేవదాయ శాఖ, పురావస్తు శాఖ సిబ్బంది, చెన్నూరు గోవింద సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రోల్ అబ్జర్వర్ రాక

కడప ఎడ్యుకేషన్: ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ –2025 కార్యక్రమానికి సంబంధించి జిల్లాకు రోల్ అబ్జర్వర్ గా నియమితులైన సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు శనివారం జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్‌ఎస్ హాలులో ఉదయం 9 గంటలకు రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ –2025 పురోగతి, జాబితాను పరిశీలించడం, ఫిర్యాదులుంటే స్వీకరించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు హాజరు కావాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ –2025 పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఈ సమావేశం ముగిసిన తరువాత ఉదయం 10 గంటలకు ప్రజలు కూడా వచ్చి ఈ అంశంపై ఏమైనా ఫిర్యాదులు ఉంటే చేయవచ్చునని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా మార్ట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాస్

బద్వేలు అర్బన్ : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని మహిళా మార్ట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో గల చేయూత మహిళా మార్ట్‌ను తమిళనాడు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, జీవనోపాధుల సంస్థ ప్రతినిధి భాస్కరన్ సేతు బృందం శుక్రవారం సందర్శించింది. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో మహిళా మార్ట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా మార్ట్‌లు లాభాలబాటలో నడుస్తున్నాయని వివరించారు. అనంతరం తమిళనాడు ప్రతినిధుల బృందం ఇక్కడి మహిళా మార్ట్ సభ్యులతో మాట్లాడి వ్యాపార వ్యవహారాలు గురించి అడిగి తెలుసుకున్నారు. తమ రాష్ట్రంలో కూడా మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు ఇక్కడ పర్యటించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో మహిళా మార్ట్ డీపీఎం హరప్రసాద్‌రాజు, బద్వేలు, గోపవరం ఏపీఎంలు శైలజ, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

తీయగా టెన్షన్ పెడుతోంది

ముప్పై ఏళ్ల క్రితం బీపీ, షుగర్ అనే మాటలు పెద్దగా వినిపించేవికావు. ఇక గుండె, కిడ్నీ తదితర వ్యాధులైతే అరుదుగా వినించేవి. క్యాన్సర్ వ్యాధి గ్రస్తులైతే చాలా అరుదుగా కనిపించే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారాయి. చాలా మంది అనారోగ్య ముప్పు మనలోనే దాగివున్న సంగతిని మరచిపోయి, ఊహించని విధంగా విరుచుకుపడే వ్యాధుల సునామీలో కొట్టుకుపోతున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో మూడవ విడతగా ఎన్‌సీడీ 3.0 (అసంక్రమిత వ్యాధులు)పై చేపడుతున్న ఇంటింటి సర్వే..స్క్రీనింగ్ పరీక్షల్లో వ్యాధులు వెలుగుచూస్తున్నాయి.

- వెన్ను పోటులా 'రక్త పోటు'
- తియ్యగా తినేస్తున్న 'షుగర్'
- కబలిస్తున్న 'క్యాన్సర్
- వ్యాధుల బారిన పడుతున్న జనాలు
- 'ఎన్‌సీడీ 3.0' ఇంటింటి సర్వే.. వైద్య పరీక్షల్లో వెల్లడి



చెర్లోపల్లెలో షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



వృద్ధురాలికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే వివరాలు

- మొత్తం జిల్లా జనాభా : 21 లక్షలకు పైగా
- మొత్తం సచివాలయాలు : 645
- 18 ఏళ్లు నిండిన వారు: 16,21,369
- మొత్తం గృహాలు : 6,50,599
- ఇప్పటి వరకు సందర్శించిన గృహాలు: 29,556
- స్క్రీనింగ్ పరీక్షలు పొందిన వారు : 90,645

ఇప్పటి వరకు షుగర్, బీపీని నిర్ధారించిన వారి సంఖ్య

- బీపీ : 4,760
- షుగర్ : 3,977

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు (లక్షణాలు కలిగిన వారు)

- నోటి క్యాన్సర్ : 427
- గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ : 259
- రొమ్ము క్యాన్సర్ : 190

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) ప్రోగ్రాంను చేపడుతున్నారు. ఎన్‌సీడీ అనగా అసంక్రమిత వ్యాధులు అని అర్థం. అసంక్రమిత వ్యాధులు అంటే అంటు వ్యాధులతో సంబంధం లేని బీపీ, షుగర్, క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర జబ్బులు. ఈ ప్రోగ్రాం కింద అసంక్రమిత వ్యాధులను ముందుగానే పసిగట్టడానికి చర్యలు చేపట్టారు. వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నడుంబిగించారు. ఈ తరుణంలో ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో యువతలో దాగున్న అనారోగ్య సమస్యలు వెలుగు చూస్తున్నాయి.

2021 నుంచి సర్వే....

ఎన్‌సీడీ కింద దాదాపు పది కార్యక్రమాలు ఉన్నాయి. అందులో ప్రధాన మైనది అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ ప్రోగ్రాం. ఇందుకు సంబంధించి ఇంటింటి సర్వే.. వ్యాధుల నిర్ధారణ 2021 అక్టోబర్‌లో మొదటగా ఎన్‌సీడీ 1.0, రెండవ విడతగా 2022 అక్టోబర్ 2 నుంచి ఎన్‌సీడీ 2.0, తాజాగా ఈనెల 15వ తేదీ నుంచి ఎన్‌సీడీ 3.0 సర్వే కార్యక్రమం జరుగుతోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, ఆశాలు ఇంటింటినీ సందర్శించి వివరాలను సేకరిస్తున్నారు. వ్యాధుల నిర్ధారణకు చర్యలు చేపడుతున్నారు.

ముందుగా గుర్తిస్తే అనర్థాలకు అడ్డుకట్ట.....

గత ఏడాది నిర్వహించిన సర్వేలో యువకులపై వ్యాధుల ప్రభావం కాస్త ఎక్కువగానే కనిపించింది. బీపీ, షుగర్ కామన్ అయిపోయింది. 'యూత్'గా చెప్పుకొనే యువతతో షుగర్, బీపీ సహవాసం చేయడం గమనార్హం. ప్రస్తుతం అనారోగ్యానికి వయసుతో తేడా లేకండా పోయింది. 'అయ్యో పాపం.. ఆ పిల్లోడు యువకుడు. ఇంకా పెళ్లి కూడా కాలేదు. ఏమైందో ఏమో తెలియదు ఉన్నట్లుండి మొన్ననే చనిపోయాడు' అనే మాటలు వింటుంటాం. అంటే ఆ యువకుడు చూడడానికి ఆరోగ్యవంతుడిగా ఉండవచ్చు. శరీరంలో మాత్రం పైకి కనిపించని జబ్బులు మాటు వేసి ఉంటాయి. ఆదమరచిపోవడం మూలంగా అదను చూసి కాటు వేస్తుంటాయి. కాగా అనేక వ్యాధులకు బీపీ, షుగర్ వ్యాధులు మూలం. వీటిని గమనించి, నియంత్రణలో ఉంచుకోకపోతే శరీరంలో ప్రధాన భాగాలైన కంటి, కిడ్నీ, గుండె, నరాలు తదితర భాగాలు దెబ్బతింటాయి. అలాగే మద్య పానం, పొగ తాగడం, గుట్కాలు తదితర వ్యసనాల వల్ల కూడా శరీరం అనారోగ్యానికి గురవుతుంది. చెడు వ్యసనాలకు అలవాటు పడినవారిలో క్యాన్సర్ కూడా ప్రభావం చూపుతోంది.

అనారోగ్యానికి చికిత్స ఇలా..

ఇంటింటికీ వెళ్లే వైద్య సిబ్బంది 18 ఏళ్లు పైబడిన వ్యక్తుల ఆరోగ్య విషయాలపై ఆరా తీస్తారు. అందులో భాగంగా బీపీ, షుగర్‌ను పరీక్షిస్తారు. క్యాన్సర్ ఇతర వ్యాధుల గురించి చర్చిస్తారు. ఒక వేళ ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వారి కుటుంబీకుల ఆరోగ్య విషయాలను పరిగణలోకి తీసుకుంటారు. క్యాన్సర్ ఇతర వ్యాధుల నిర్ధారణకు కడప రిమ్స్‌కు రెఫర్ చేస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందజేస్తారు. అవసరం అయితే ఆరోగ్య శ్రీ కింద ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు. ఇక బీపీ, షుగర్ తదితర వ్యాధులకైతే స్థానిక ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, పీహెచ్‌సీలు, 104 సంచార వైద్యశాలల ద్వారా చికిత్స అందిస్తారు. కాగా ఈ సర్వేల తీరును పరిశీలిస్తే మనిషిని షుగర్..బీపీల రూపంలో 'తీయ'గా తినేస్తూ 'టెన్షన్' పెడుతోందని చెప్పవచ్చు.

సర్వే ద్వారా వెలుగు చూస్తున్న వ్యాధులు...

తాజాగా నిర్వహిస్తున్న సర్వేలో బీపీ, షుగర్‌తో పాటు గర్భాశయ ము ఖ ద్వారం, రొమ్ము, నోటి క్యాన్సర్‌పై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో ముందు వరుసలో మధుమేహం, తరువాత స్థానంలో హైపర్ టెన్షన్ (బీపీ) ఉండగా అనుమానిత జా బితాలో వరుస క్రమంలో నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్ వ్యాధులు ఉన్నాయి. పరీక్షల ద్వారా షుగర్, బీపీని నిర్ధారించిన వారికి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందవచ్చని సూచిస్తున్నారు.

సిబ్బందికి సహకరించాలి...



సర్వేతో పాటు అవసరమైన వారికి వైద్య పరీక్షల్లో భాగంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది వస్తారు. వారు ఆరోగ్యపరమైన అంశాలకు సంబంధించిన వివరాలు అడుగుతారు. కుటుంబ సభ్యులు సిబ్బందికి సహకరించాలి. ఈ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. – డాక్టర్ ఎస్ రమేష్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే.

తొలి దశలోనే వ్యాధులకు అడ్డుకట్ట వేయచ్చు...



ఎన్‌సీడీ ద్వారా చేపడుతున్న సర్వే..వైద్య పరీక్షలు ప్రయోజనకరంగా ఉన్నాయి. వ్యాధులు తీవ్ర రూపం దాల్చకముందే, ప్రారంభ దశలోనే గుర్తించడం వలన వ్యాధులను అరికట్టవచ్చు. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

గెలుపోటములు కాదు.. క్రీడా స్ఫూర్తితో ఆడాలి

- జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు
- జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలు
- పాల్గొంటున్న ఆరు పోలీస్ సబ్ డివిజన్‌లు





బెలూన్స్ ఎగురవేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, జిల్లా పోలీసులు, వాలీబాల్‌లో తలపడుతున్న పోలీసుల జట్లు

కడప అర్బన్: క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలి.. గెలుపోటములు ముఖ్యంకాదని జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు పాల్గొనే వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలు –2024ను జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ప్రారంభించారు. ప్రారంభసూచకంగా బెలూన్‌లు, కపోతాలను ఎగురవేశారు. జిల్లాకు చెందిన జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎస్ విజయభాస్కర్ జిల్లా ఎస్పీ క్రీడాజ్యోతిని అందించారు. ఎస్పీ క్రీడాజ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఆటలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయని, 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడా ప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. క్రమశిక్షణ, పోలీస్ సిబ్బంది మధ్య మరింత సమన్వయం పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీస్‌మీట్‌కు పంపిస్తామన్నారు. ఈనెల 29, 30, డిసెంబర్ 1వ తేదీలలో వరుసగా మూడు రోజులపాటు సాగే స్పోర్ట్స్‌మీట్‌లో ఆరు పోలీస్‌సబ్‌విజన్‌లకు సంబంధించిన టీమ్‌లు (కడప, మైదుకూరు, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, డీ.ఏ.ఆర్) కబడ్డీ, వాలీబాల్, పుట్‌బాల్, అథ్లెటిక్స్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్‌జంప్, క్రికెట్, షటిల్ మొదలైన క్రీడల్లో పాల్గొంటారన్నారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ జరుపుకోవడానికి అవకాశం కల్పించిన రాష్ట్ర డీజీపీ సీహెచ్. ద్వారకా తిరుమల రావు, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్‌కు ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)కె. ప్రకాష్‌బాబు, ఏ.ఆర్. అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్‌ఐలు ఆనంద్, వీరేష్, టైటస్, శివరాముడు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ్ కుమార్

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప రైల్వే స్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం సాయంత్రం గుంతకల్ డీఆర్ఎం విజయ్ కుమార్ తనిఖీ చేశారు. ఏమేం పనులు జరుగుతున్నాయి.. ఎంతవరకు పనులు పూర్తయ్యాయి.. ఎప్పటిలోగా పనులను పూర్తి చేస్తారని అధికారులతో మాట్లాడారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మొదట ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో లోకో పైలట్ గార్డ్స్ రన్నింగ్ రూమ్స్ ప్రారంభించి ఆ తర్వాత ఆయన కడపకు వచ్చారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ సీనియర్ డీఈలు వీరయ్య, సుదర్శన్ రెడ్డి, సీనియర్ డీఓఎం శ్రావణ్ కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఈఎన్ అభిరామ్, కడప రైల్వే కమర్షియల్ మేనేజర్ జనార్దన్, ఏడీఈఎన్ రాధాకృష్ణ, ఎస్ఐ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ల పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళా శాల పరీక్షా కేంద్రాన్ని వైవీ యూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధి కారి ఆచార్య కే.ఎస్.వి. కృష్ణారావులు తనిఖీ చేశారు. అనంతరం ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేయగా, పులివెందుల లయోలా కళాశాలను ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. జిల్లాలోని 54 కేంద్రాలలో 1, 3, 5 సెమిస్టర్లకు సంబంధించిన 20,819 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు.

చిరుద్యోగులకు ఎసరు

- విద్యుత్ శాఖలో 'స్మార్ట్' కలకలం
- మీటర్ రీడర్ల కొలువుకు గండం
- బిల్ కలెక్టర్లకు చెల్లు చీటీ
- ప్రత్యామ్నాయ ఉపాధిపై హామీ ఇవ్వని ప్రభుత్వం



రాయచోటిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్



రాయచోటి: 'మేము అధికారంలోకి వస్తే లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిస్తాం.. ఉపాధి కల్పిస్తాం' అని ఊకదంపుడు ప్రసంగాలు చేసి ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చింది. తీరా ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలతో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉపాధి నిస్తూ వస్తున్న చిన్నపాటి ఉద్యోగాలకు సైతం ఎసరు పెట్టి లక్షలాది మందిని నిరుద్యోగులుగా మార్చి రోడ్డున పడేస్తోంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఒక్క అన్నమయ్య జిల్లా నుంచే 8528 మంది గ్రామ, వార్డు వలంటీర్ల కొలువులకు చరమగీతం పాడింది. నేడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 350 మంది మీటర్ రీడర్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో.. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో వెనక్కి తగ్గింది. వైఎస్‌ఆర్‌సీపీ అధికారం కోల్పోవడానికి స్మార్ట్ మీటర్లు కూడా ఓ కారణమైందనే వాదన ఉంది. నాడు విమర్శలు గుప్పించిన కూటమి నేడు స్మార్ట్ వైపే అడుగులు వేస్తుండటంపై మీటర్ల రీడర్లు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలకు బిగింపు ప్రక్రియ పూర్తి చేశారు. రెండో దశగా కేటగిరీ –2 కింద జిల్లా పరిధిలోని కమర్షియల్ వినియోగదారులకు వీటిని అమర్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటి ఏర్పాటుపై వామపక్షాలు ఉద్యమాలు సైతం చేస్తున్నాయి. వీటి ఏర్పాటును వినియోగదారులు వ్యతిరేకిస్తుండగా.. సంస్థలోని మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్ల ఉపాధికి గండిపడి రోడ్డు పాలు కానున్నారు.

ఆన్‌లైన్‌లో మీటర్ రీడింగ్

ప్రస్తుతం విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లు వినియోగదారుల గృహాలకు వెళ్లి.. ఆ నెలలో వాడిన యూనిట్ల వివరాలు నమోదు చేసుకుని బిల్లులు మంజూరు చేస్తారు. జిల్లాలోని ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ డిస్కంల పరిధిలో వీరు పని చేయాల్సి ఉంటుంది. సుమారు 350 మందికి పైగా మీటర్ రీడర్లు పని చేస్తున్నారు. వీరికి ఇంధన శాఖ పీస్‌రేట్ ప్రకారం వేతనాలు చెల్లిస్తోంది. అంటే వారికి కేటాయించిన గృహాల సర్వీసుల సంఖ్య ప్రకారం ఒక్కో సర్వీస్‌కు రూ. 3.50 ఇస్తారు. అంటే ఒక్కొక్క మీటర్ రీడర్‌కు వారి సర్వీసుల ప్రకారం సుమారు 5 నుంచి 10 వేల రూపాయల వరకు వేతనం అందుతుంది. వారిని కనీసం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా సైతం గుర్తించకపోవడంతో వీరికి ఇంధన శాఖ నుంచి ఎటువంటి అదనపు సౌకర్యాలు వర్తించవు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలకు సైతం నోచుకోలేదు. కనీస వేతనం ప్రశ్నే వీరి దరిచేరదు. అయినా ఎప్పటికైనా తమను కనీసం కాంట్రాక్ట్ కార్మికులుగానైనా గుర్తిస్తారన్న ఆశతో బతుకుబండిని లాగిస్తున్నారు. వీరికి నెలలో మొదటి పది రోజులే పని ఉంటుంది. మిగిలిన రోజుల్లో విద్యుత్ శాఖాధికారులు వీరిని ఇతర సేవలకు వినియోగించుకుంటున్నా.. ఎటువంటి జీతాలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఉద్యమాలకు సన్నద్ధం

ప్రభుత్వం తాజాగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడంతో ఇక మీటర్ రీడర్ల అవసరం ఉండదు. ఈ మీటర్లు ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ ప ద్ధతుల్లో వినియోగదారులే నేరుగా రీ చార్జ్ చేయించుకునే సౌలభ్యం ఉంది. దీంతో డబ్బులు అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ప్రత్యేకంగా మీటర్ రీడరు వచ్చి బిల్లులు మంజూరు చేయాల్సిన అవసరం ఉండదు. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల వ్యాప్తంగా ఉన్న 350 మంది ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమైంది. భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలకు వీరు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

జూదరుల అరెస్టు

లింగాల : మండలంలోని చిన్నకుడాల–ఇప్పట్ల గ్రామాల మధ్యలో శుక్రవారం జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొండూరు, సింహాద్రిపురం, పులివెందులకు చెందిన జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,01,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

నేడు 'మానవత' వనభోజన ఉత్సవం

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని శ్రీ అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి కార్తిక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మానవతా సంస్థ అధ్యక్షుడు బైరెడ్డి శివ విష్ణుమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తికమాసం సందర్భంగా కుల మతాలకు అతీతంగా మానవతావాదులందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మహిళలకు ప్రత్యేకంగా ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం మానవతా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు.

2న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో డిసెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రారెడ్డి, ఆర్.వి. సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలబాలికలు, 65 నుంచి 70కేజీల లోపు బరువు ఉన్న క్రీడాకారులు ఎంపికలకు హాజరు కావాలని సూచించారు.


ఇరు వర్గాల మధ్య ఘర్షణ – కేసు నమోదు

కమలాపురం : మండల పరిధిలోని అప్పారావుపల్లె గ్రామానికి చెందిన ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణకు పాల్పడిన ఇరు వర్గాల ఆరుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి అప్పారావుపల్లె గ్రామానికి చెందిన రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ఎల్లారెడ్డిలతో పాటు లక్ష్మీ నారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వీర నారాయణ రెడ్డిలు పాత కక్షల కారణంగా ఘర్షణ పడ్డారన్నారు. ఈ ఘర్షణలో ఒక వర్గంలోని రవి శంకర్‌తో పాటు మరో వర్గంలోని వీర నారాయణరెడ్డికి రక్త గాయాలయ్యాయన్నారు. కాగా వారిని కమలాపురం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో బేల్దారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఆర్ట్స్‌కాలేజీ రోడ్డుకు చెందిన నాగేంద్ర (23) ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగేంద్ర బేల్దారి పనికి వెళ్తుంటాడు. అయితే అతను కొన్ని రోజుల నుంచి ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. మనస్థాపం చెందిన అతను శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి వివాహం కాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకర జీవితం


వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీయూ వీసీ, అధ్యాపకులు

డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

వైవీయూ : ప్రణాళిక బద్ధమైన జీవితం, ఉద్వేగాల నియంత్రణ ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని విజయవాడ ఇండ్లాస్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఇండ్ల రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ప్రధాన్ మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (పి.ఎం -యు.ఎ స్.హెచ్.ఎ) ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల పని జీవిత నిలకడ మానసిక సమస్యలు' (సైకలాజికల్ ఇష్యూస్ ఆఫ్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఫర్ టీచర్స్ ఇన్ హైర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్) అనే అంశంపై వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. (పి.ఎం-యు.ఎస్.హెచ్.ఎ) సమన్వయకర్త డా.టి. చంద్రశేఖర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సానుకూల ఆలోచనలతో ఒత్తిడిని దూరం చేయవచ్చన్నారు. సంతోషాన్ని ఇచ్చే విషయాలను గుర్తుంచుకొని దుఃఖాన్ని పెంచే విషయాలను దూరంగా ఉంచాలన్నారు. విజయాలు అపజయాలను సమానంగా స్వీకరించాలని సూచించారు. అన్ని పనులు మనమే చేయాలని, అన్నింటిలో మనమే విజయం సాధించాలనుకోవడం కరెక్ట్ కాదన్నారు. ప్రయత్నం చేయాలి కానీ ఫలితం గురించి ఆలోచించవద్దన్నారు. కుటుంబ సభ్యులకు సమయం కేటాయించాలని సూచించారు. కొన్ని సమస్యలకు కాలమే పరిష్కారం చూపుతోందని తెలిపారు. చేయాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో నమోదు చేసుకొని చేయాలన్నారు. సంతోషకర విషయాలతోపాటు బాధాకర విషయాలు కూడా మిత్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని సమన్వయం చేసిన చంద్రశేఖర్ ను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ప్రణాళిక బద్ధమైన జీవితం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యాపకులకు మానసికపరమైన సమస్యలపై సందేహ నివృత్తి చేశారు. (పి.ఎం-యు.ఎస్.హెచ్.ఎ) సభ్యులు, రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు

- ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించడం శోచనీయం
- నవరణల పేరుతో ఇప్పటికే ఆ చట్టం నీరుగారిపోయింది
- రాజకీయ లబ్ధి కోసమే కేసులు
- దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిశోర్


మాట్లాడుతున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయి. కేసుల్లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించడం శోచనీయమని దళిత ఫోరం జిల్లా చైర్మెన్ బూసిపాటి కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను పావులుగా వాడుకుంటున్న కొంత మంది రాజకీయ నాయకుల తప్పుడు బుద్ధితోనే ఇలాంటి కేసులు నమోదవుతున్నాయన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులకు, కేసులు పెడుతున్న దళితులకు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. ఎంతో సమున్నత లక్ష్యంతో తీసుకువచ్చిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం రాజకీయ నాయకుల తప్పుడు విధానాలతో ఇప్పటికే నీరుగారిందన్నారు. అట్రాసిటీ చట్టం ఇంకా నీరుగారితే ఇక దళితులను ఎవరూ రక్షించలేరని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల్లో రాజకీయ చిచ్చు రేపింది చంద్రబాబునాయుడేనని, రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసేందుకు దళితులను వాడుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు దళితులు తలొగ్గరాదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటిపట్టా వచ్చినందుకు గీతాంజలి అనే దళితురాలు సోషల్ మీడియాలో సంతోషం వ్యక్త చేసినందుకు ఆమెపై అసభ్యంగా పోస్టులు పెట్టారని, ఆ అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. ఆరునెలలైనా ఇప్పటి వరకూ నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం పటిష్టంగా ఉండి ఉంటే నిందితులకు ఈపాటికి శిక్ష పడేదన్నారు. దళితుల రక్షణ కోసం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చిందని, అది రాజకీయ పావుగా మారితే నష్టపోయేది దళితులేనన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చాలని చూస్తే కడప నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం తిడతామని హెచ్చరించారు. సమావేశంలో అఖిలభారత అంబేడ్కర్ సేన ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పి పెంచలయ్య పాల్గొన్నారు.

'బ్రౌన్' జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ

కడప కల్చరల్ : తెలుగుభాష రక్షకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని కడపలోని బ్రౌన్ గ్రంథాలయం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. తెలుగుభాష ఉనికికి ప్రమాదం ఏర్పడిన సందర్భంగా తన జీతం, జీవితాన్ని భాషోద్ధరణకు అంకితం చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కడప నగరాన్ని కార్యస్థానంగా చేసుకుని తెలుగుభాషను రక్షించడమే కాకుండా భావితరాలకు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన వివరించారు.

ఆయన స్మారకంగా ప్రస్తుతం కడప నగరంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వెలసిందని, ఇందులో 70 వేలకు పైగా అపురూపమైన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు ఉన్నాయన్నారు. తెలుగుభాష ఉద్ధరణకు ఆయన చేసిన సేవ అనితర సాధ్యమన్నారు. పదవీ విరమణ తర్వాత దేశం విడిచి లండన్ వెళ్లాక కూడా ఆయన తెలుగుభాష సేవలో తరించారన్నారు. బ్రౌన్ 1798 నవంబరు 10న జన్మించారని, 1884 డిసెంబరు 12న పరమపదించారని, ఆయన జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతున్నామన్నారు.

ఇన్‌చార్జి ఆర్‌ఐ ఆగడాలు

- ఆది నుంచి అక్రమ వసూళ్లు
- పింఛన్‌దారులను కూడా వదలని వైనం
- ఎట్టకేలకు సస్పెన్షన్

కడప కార్పొరేషన్ : వార్డు సచివాలయ సెక్రటరీలు పెడదారి పడుతున్నారు. లంచాలు, కమిషన్లకు అలవాటు పడి ప్రజలను వేధించడంతోపాటు పనిచేస్తున్న సంస్థకు కూడా నష్టం చేకూరుస్తున్నారు. అలాంటి వారిపై కడప నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. వేయాల్సిన పన్ను కంటే తక్కువ పన్ను వేసినందుకు ఇద్దరు అడ్మిన్ సెక్రటరీలను, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇన్‌చార్జి ఆర్‌ఐ నరేంద్రను శుక్రవారం నగర పాలక కమిషనర్ సస్పెండ్ చేశారు. ఇదివరకు పనిచేసిన కమిషనర్ వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరీలుగా పనిచేస్తున్న కొందరికి ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా అధికారాలు కల్పించారు. నిబంధనల ప్రకారం పర్మినెంట్ ఉద్యోగులు, అనుభవం ఉన్నవారినే ఈ పోస్టులో నియమించాలి...కానీ అవేమీ గత కమిషనర్ పట్టించుకోలేదు. తాను ఏం అనుకుంటే అది చేస్తూ వచ్చారు. అందులో భాగంగా నరేంద్ర అనే అడ్మిన్ సెక్రటరీని కూడా ఇన్‌చార్జి ఆర్‌ఐగా నియమించారు. అతన్ని ఆ పోస్టులో నియమించినప్పటి నుంచి కార్పొరేటర్లు, ప్రజల నుంచి ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా గత కమిషనర్ పట్టించుకోలేదు. దీంతో అతని ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయినట్లు సమాచారం. పన్నులు వేసినందుకు, మ్యుటేషన్ చేసినందుకు ఇలా ఏ పని చేసినా చేయి తడపనిదే పని చేయడనే పేరు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. తన జోన్‌లోని అడ్మిన్‌లపై పెత్తనం చేస్తూ...ఏ పని చేయాలన్నా వారి నుంచి వసూళ్లు చేసేవాడని సమాచారం. భవనాల కొలతల్లో తేడాలు చూపి తక్కువ పన్ను వేసి లంచాలు గుంజేవాడని, కమర్షియల్ బిల్డింగ్‌లను, రెసిడెన్షియల్‌గా చూపి కార్పొరేషన్ ఆదాయానికి నష్టం చేకూరుస్తున్నట్లు తెలిసింది. తాజాగా తనకిచ్చే వితంతు పింఛన్‌లో ప్రతినెలా రూ.500 వాటా వసూలు చేస్తున్నాడని, ఇవ్వకపోతే పింఛన్ రద్దు చేయిస్తానని బెదిరిస్తున్నాడని పుట్లంపల్లికి చెందిన ఓ మహిళ మంత్రి లోకేష్‌కు రాతమూలకంగా ఫిర్యాదు చేయడంతో అతని అవినీతి బట్టబయలైంది. ధైర్యం చేసి ఈ వితంతు మహిళ ఫిర్యాదు చేసింది...ఇక ఫిర్యాదు చేయని వారెందరో చెప్పలేం. ఈ ఫిర్యాదుపై విచారణ చేసిన నగరపాలక అధికారులు సదరు ఇన్‌చార్జి ఆర్‌ఐని కూడా సస్పెండ్ చేశారు.

ఎక్కువ మంది సెక్రటరీలపై ఆరోపణలు :
కడప నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌చార్జి ఆర్‌ఐలుగా, ఏఈలుగా, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా అధికారాలు కట్టబెట్టారు. వీరు తమ స్థాయిని మర్చిపోయి అవినీతికి కొత్తమార్గాలు అన్వేషిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. తమతోటి సెక్రటరీలను వేధించి వారు చెప్పినట్లు నడుచుకునేలా చేస్తున్నారని అనేక ఫిర్యాదులు వచ్చాయి. వారిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా గత కమిషనర్ చెవికెక్కించుకోలేదని సమాచారం. దీంతో వారి అధికారాలు రద్దు చేయాలని వారిని యథాస్థానాలకు పంపాలని స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసినా అది అమలు కాలేదు. ఇప్పటికైనా వారు తమ పద్ధతి మార్చుకొని ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించరాదు


ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి వినతి ప్రతం అందజేస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయన్ని కడపలోనే కొనసాగించాలని ఆ బ్యాంకు ఉద్యోగ, అధికార సంఘాల ప్రతినిధులు శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిని కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ కడప ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఏపీజీబీ మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దది కావడం, గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సొంత భవనం కలిగి ఉందన్నారు. అలాగే దక్షిణ భారత దేశంలో ఏ గ్రామీణ బ్యాంకునకు లేనటువంటి కరెన్సీ చెస్ట్ సౌకర్యం కలిగి ఉండడంతో పాటు అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఉండడం వలన ప్రతిపాదిత గ్రామీణ బ్యాంకు హెడ్ ఆఫీస్ కడపలోనే కొనసాగించడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాలు అమరావతిలో కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో నూతనంగా ఏర్పడబోతున్న, ఈ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కూడా కడప నుంచి అమరావతికి తరలిపోతుందన్న ఆందోళన ఏపీజీబీ సిబ్బందితో పాటు ఈ ప్రాంత ప్రజల్లో కూడా ఉంది. ఈ విషయంపై శాసనమండలిలో కూడా ప్రస్తావించి ఏపీజీబీ హెడ్ ఆఫీస్ కడపలో కొనసాగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ.మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలి


పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రొద్దుటూరు : బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కోరుతూ ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. దళితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాదిగ మాట్లాడుతూ ఈ అంశంపై సత్యసాయి జిల్లా మడకసిర నియోజకవర్గం నుంచి దళిత చైతన్య యాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు ఈ యాత్రను నిర్వహిస్తామన్నారు. స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు అయినా దళిత, గిరిజనుల్లో పేదరికం, అంటరానితనం తొలగిపోలేదన్నారు. అగ్రవర్ణాల ప్రభుత్వాల పరిపాలనలో నిష్పక్షపాతంగా రాజ్యాంగాన్ని అమలు చేయకపోవడం వల్లే ఈ విధంగా జరుగుతోందన్నారు. పాలకులు వారి ప్రయోజనాల కోసమే రాజ్యాంగాన్ని 125 సార్లు సవరణ చేశారే కానీ పేదరిక నిర్మూలన కోసం ఒక్క సవరణ కూడా చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా రాజ్యాంగాన్ని అమలు చేసే విధంగా ఈ యాత్రను చేపట్టామన్నారు. దళిత, గిరిజనులపై దాడులు, మానభంగాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. భోగస్ కులాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసేలా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగభూషణం మాదిగ, బాలలక్ష్మయ్య మాదిగ, శివరాం, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విద్యుత్ భవన్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా


విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, విద్యుత్ మీటర్ రీడర్లు

కడప కార్పొరేషన్ : విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల(ఏపీవీఎంఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 4500 మంది విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పదిహేను ఏళ్లుగా వీరు పనిచేస్తున్నారని, స్మార్టు మీటర్లు, ప్రీపెయిడ్ మీటర్ల వల్ల వీరి ఉపాధికి దెబ్బ పడే అవకాశం ఉందన్నారు. వీరి అర్హతల మేరకు యాజమాన్యం వారికి పని కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే సర్కిల్ కార్యాలయాలు, సబ్‌స్టేషన్లలో వీరిని తీసుకోవాలన్నారు. మీటర్ రీడర్లకు ఇచ్చే కమిషన్‌పై కూడా బేరసారాలు ఆడటం సరికాదని, యాజమాన్యం ఇచ్చిన పీస్ రేటు యథావిధిగా అమలు చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో వేల కోట్ల అవినీతి జరుగుతోందని, ఆ అవినీతిని రూపుమాపితే వీరందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పించడం కష్టమేమీ కాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో థర్డ్ పార్టీలో శానిటేషన్, సెక్యూరిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్ ఈఎస్‌ఐ కాంట్రాక్టర్ చెల్లించాల్సిన మొత్తం, కార్మికులు చెల్లించాల్సిన మొత్తాన్నీ కార్మికుల వేతనంలోనే కట్ చేస్తున్నారన్నారు. ఇది పీఎఫ్ చట్టాన్ని ఉల్లంఘించడమేనని తెలిపారు. జిల్లాలో పేద విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చదివే దానికోసం గొప్ప అవకాశం కడప జిల్లాలో ఉందని, అందులో పని చేసే శానిటేషన్ కార్మికులకు అక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న అనిల్ కుమార్ రెడ్డి అనే ఉద్యోగి శాపంగా మారారని అక్కడున్న కార్మికులు వాపోతున్నారన్నారు. ఏదైనా అనారోగ్య కారణాల చేత లేటుగా వచ్చినా, విధులకు హాజరు రాలేకపోయినా వారిని విధుల నుంచి వారం నుంచి పది రోజులు సస్పెండ్ చేస్తున్నారన్నారు. ఇలాంటి అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు.

పెళ్లి చేసుకోవడం.. డబ్బు దండుకోవడం

- నలుగురిని వివాహమాడి మరొకరిని పెళ్లాడి డబ్బు కోసం బ్లాక్‌మెయిల్
- డబ్బు ఇవ్వకపోతే కేసు పెట్టి జైలుకు పంపిస్తామంటూ బెదిరింపులు
- జల్సాల కోసం ఓ మహిళ దందా
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఐదో భర్త


న్యాయం చేయాలని కోరుతున్న మస్తాన్‌వలి

కడప అర్బన్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌లో నివాసం వుంటున్న షేక్ ఉమ్మే సల్మా అనే మహిళ తన భర్తను వదలిపెట్టి నలుగురిని వివాహం చేసుకుందని, తనను బ్లాక్‌మెయిల్ చేసి వివాహం చేసుకుని లక్షల్లో డబ్బును దండుకోవడమేగాక, డబ్బు ఇవ్వకపోతే కేసు పెట్టి జైలుకు పంపించి బెదిరిస్తోందని కడపకు చెందిన షేక్ మస్తాన్‌వలీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వినతిపత్రాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను కడప నగరంలోని ఓ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నానన్నారు. ఆ సమయంలో షేక్ ఉమ్మే సల్మా తనకు పరిచయమై తనకు గతంలో వివాహమైందని, భర్తను వదిలేశానని మాయమాటలు చెప్పిందన్నారు. తరువాత కొన్నిరోజులకు తనతో పాటు ఆమె చెల్లెలు, చెల్లెలి భర్తతో కలిసి బెదిరించి వివాహం చేశారన్నారు. తరువాత విడతల వారీగా తన దగ్గరి నుంచి విడిపోయేందుకు అగ్రిమెంట్ రాయించుకుని రూ.లక్షల్లో డబ్బును దండుకున్నారన్నారు. ఆమె గురించి తరువాత విచారించగా, తనకు పరిచయం కాకముందు షేక్ అజ్మతుల్లాతో వివాహమై విడిపోయిందన్నారు. తరువాత షేక్ కరీముల్లా, గౌస్, ఆటోడ్రైవర్ శివలను వివాహం చేసుకుని వారిని బ్లాక్‌మెయిల్ చేయడం, అందినకాడికి డబ్బులను దండుకుని మరొకరిని పరిచయం చేసుకుని వారిని ఇలాగే మోసగించడం అలవాటుగా మారిందన్నారు. ఆమె చెల్లెలు భర్త సాదిక్ ఇటీవల కడప తాలూకా పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా వున్నాడని, తాను డబ్బును ఇవ్వకపోయినా, తమకు సహకరించకపోయినా అతని చేతనే హత్య చేయిస్తామని బెదిరిస్తున్నారన్నారు. తనకు న్యాయం చేసి షేక్ ఉమ్మే సల్మా నుంచి, ఆమె బంధువుల నుంచి తనకు, కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని, తనకు వారినుంచి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె మండలం గుర్రుగుంపు తండాలో నాటు సారాతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీదారులపై తమ సిబ్బంది ఎప్పటికప్పుడు నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ నాయక్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి, కడప ఎక్సైజ్ సీఐ కృష్ణమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగరాజుపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న అంజలి (25) ఆత్మహత్యకు కారణమైన అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న భానుప్రసాద్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అంజలి, భానుప్రసాద్ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడన్న ఆవేదనతో అంజలి ఈనెల 6న ఇంజక్షన్ వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 12వ తేదీన మృతి చెందింది. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు భానుప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భానుప్రసాద్‌ను అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.

మెడికల్ కాలేజ్ ఏఓ మృతి

మదనపల్లె : మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి పుల్లంరాజు (55) గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏప్రిల్‌లో రాయచోటి నుంచి మదనపల్లె మెడికల్ కాలేజీ ఏఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడిగా పుల్లంరాజు పనిచేస్తున్నారు. రెండురోజుల నుంచి శ్వాస సంబంధిత సమస్యలతో అనారోగ్యానికి గురై కడపలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మృతిచెందాడు. కాగా, ఆయన స్వగ్రామం సంబేపల్లె. భార్య రాజ్యలక్ష్మి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఇస్తిమా ఏర్పాట్ల పరిశీలన

రాయచోటి/చిన్నమండెం : డిసెంబర్ 7, 8వ తేదీలలో రాయచోటి పట్టణ శివార్లలో ముస్లిం సోదరులు నిర్వహించనున్న ఇస్తిమా ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులతో కలిసి వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఇస్తిమా నిర్వహణ ఏర్పాట్లపై మత గురువులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు రాయచోటి పట్టణంలోని మదనపల్లి రహదారి మార్గంలోని గొర్లముదివీడు క్రాస్ సమీపంలో అత్యంత పవిత్రంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇస్తిమా కార్యక్రమానికి దాదాపు ఒకటన్నర లక్షల మంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తుండటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, గౌస్‌ఖాన్, అల్తాఫ్, రౌనక్, వందాడి సర్పంచ్ ముసలిరెడ్డి, జాకీర్, ఫయాజ్‌అహమ్మద్, అన్నాసలీం, మజా కోఆప్షన్ జాఫర్‌అలీఖాన్, జీఎండీ ఇర్షాద్, నవాజ్, యూసుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్లు కూల్చిన వారిపై కేసు నమోదు చేయాలి


కూల్చివేసిన దళితుల ఇళ్లను పరిశీలిస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఐలమ్మకాలనీలో 16 ఏళ్లుగా నివాసముంటున్న దళితులపై దౌర్జన్యం చేసి వారి ఇళ్లు కూల్చివేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇమ్మానియేల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటరమణలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐలమ్మకాలనీలో కూల్చివేయబడిన దళితుల ఇళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా మున్సిపాలిటీకి పన్ను కడుతూ కరెంటు మీటరు కూడా కలిగి ఉన్న ఓబయ్య, గంగయ్యల ఇళ్లను గుల్జార్, జాఫర్, నాయబ్‌తో పాటు మరి కొంత మంది వచ్చి దౌర్జన్యం చేసి కూల్చివేయడం దారుణమన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని దళితులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం స్పందించి దళితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దళిత సంఘాలను కూడగట్టుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, పట్టణ నాయకులు ఓబులేసు, రాజశేఖర్, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.